# ఆజ్‌కీ తాజా టీవీ సీరియల్



**మా** నిర్భయ్‌నగర్ కాలనీ తాలూకూ వెల్ఫేర్ సొసైటీకి షుమారు పాతిక లక్షల ఫండ్స్ పోగయినయ్.

ప్రతి వినాయక చవితికీ ఖచ్చితంగా రెండు లక్షలు మిగుల్తుంది. వినాయకుండి లడ్డూ వేలం వేయటం వల్ల ఇంకో లక్ష వస్తుంది.

ఇలా వస్తోన్న ఆదాయాన్ని అలా బాంక్‌లో వేసి ఉంచటం కంటే దానిని నాలుగయిదు రెట్లు పెంచుకునే కార్యక్రమం ఏదయినా చేపట్టాలని కాలనీ వాళ్ళందరం డిసైడ్ చేశాం.

"మన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో షేర్లు కొందాం! మన పెట్టుబడికి నూటికి నూరు శాతం లాభం వస్తుంది అయిదేళ్ళల్లో–" అన్నాడు శ్యామ్రావ్.

ఆ అయిడియా బావుందని కొంతమంది అతనిని సపోర్ట్ చేశారు.

స్టాక్ మార్కెట్ గురించి మాకు పెద్దగా నాలెడ్జ్ లేకపోవటం వల్ల నేనూ, శాయిరామ్, రంగారెడ్డి– ఎటూ మాట్లాడలేకపోయాం– కాలనీ వాళ్ళందరం కూడా తలో లక్షా స్టాక్ మార్కెటలో పెడితే బాగుంటుందని జనార్ధన్ కూడా ఓ సలహా ఇచ్చాడు అప్పుడే సావిత్రమ్మ లేచి నిలబడింది.

"నన్నడిగితే లాంగ్ టరమ్ కాకుండా ఫ్యూచర్స్‌లో ట్రేడింగ్ చేస్తే ఈజీగా నెలల్లో డబుల్ చేసుకోవచ్చు–" అంది. అదే అదనుగా తీసుకుని శ్యామ్రావ్ స్టాక్ మార్కెట్ ఎంత గొప్పదో ఉదాహరణలిస్తూ ఉపన్యాసం ప్రారంభించాడు. సరిగ్గా అప్పుడే రెగ్యులర్‌గా మా కాలనీ కొచ్చే బిచ్చగాడు జనాన్ని తోసుకుంటూ డయాస్ దగరకొచ్చాడు.

"అమ్మలారా, అయ్యలారా! గత నాలుగేళ్ళుగా మీ కాలనీ వాళ్లందరూ– నాకు లేదనకుండా భిక్షవేస్తూ ఆకలితో చావకుండా నన్నూ, నా భార్యా పిల్లలనూ అదుకుంటు న్నారు. ఇంతమంచి మనుషులున్న మీ కాలనీవాళ్ళు పదికాలాల పాటు పచ్చగా ఉండాలని కోరుకునేవాళ్ళల్లో నేను మొదటివాడిని. మీరిప్పుడు మీ కాలనీ డబ్బంతా స్టాక్ మార్కెట్‌లో పెట్టాలని ఆలోచిస్తూంటే నాకు హార్ట్ ఎటాక్ వచ్చినట్లయింది– ఎందుకంటే మీరంతా కూడా నాలాగానే చిప్పపట్టుకుని ఇంకో కాలనీకి అడుక్కోడానికెళ్ళటం నేను చూళ్ళేను–"

శాయిరామ్‌కి అనుమానం వచ్చింది.

"అంటే నువ్వు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టావా?"

"అవున్సార్! కాస్తా కూస్తా కాదు పదిలక్షలు– మొత్తం మటాష్ అయిపోయింది. అప్పుల పాలయి, ఉద్యోగం పోగొట్టుకుని ఇలా వీధినపడ్డాను–" చెప్తూంటే అతని కళ్లవెంబడి నీళ్ళు రాలినయ్.

ఆ మాట వినగానే శ్యామ్రావ్ కంగారుపడ్డాడు.

"ఎక్కడో ఒకడు నీలా అయ్యాడని భయపడితే ఎలా? ఝంఝున్‌వాలా ఎన్నికోట్లు

సంపాదించాడు? బఫెట్ ఎన్ని బిలియన్లు సంపాదించాడు–' అంటూంటే వెనుక నుంచి ఇంకో బిచ్చగాడు చొచ్చుకుని ముందుకొచ్చాడు.

"వాళ్ళ సంగతి సరేసార్! మన హర్షద్ మొహతా సంగతేంటి? హర్షద్ మొహతా లాంటి మోసగాళ్ళు ఇండియన్ స్టాక్ మార్కెట్‌ని బాంక్‌ల సాయంతో ఫుట్‌బాల్ ఆడుకుంటూ అమాయకులయిన ఇన్‌వెస్టర్లను మోసంచేసి లక్షల కోట్లు తినేశారు– తింటున్నారు– ప్రపంచంలో ఇండియన్ స్టాక్ మార్కెట్ అంత చెత్త స్టాక్ మార్కెట్ ఇంకోటి లేదు–" అన్నాడతను ఆవేశంగా.

"అంటే నువ్వు కూడా..." డౌటుగా అడిగాడు రంగారెడ్డి.

"అవున్సార్ మన బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో జరిగే మోసాలవల్ల ఇల్లు అమ్ముకుని వీధినపడ్డాను సార్–"

ఇంక లాభంలేదని శ్యామ్‌ప్రావ్ అక్కడినుంచి జారుకున్నాడు.

ఆ తరువాత అందరూ మళ్ళీ రకరకాల సజెషన్స్ ఇవ్వటం మొదలుపెట్టారు. ఆఖరికి మా కాలనీ యూత్‌వింగ్ సెక్రటరీ దీపిక ఓ సజెషన్ ఇచ్చింది.

"అంకుల్! ఈ రోజుల్లో టీవీ సీరియల్స్ తీయటం మాంఛి లాభసాటి వ్యాపారం అంకుల్. లాభం వందల కోట్లల్లో ఉంటుంది– ఏ సీరియల్ అయినా చూడండి! వెయ్యి ఎపిసోడ్లు, రెండువేల ఎపిసోడ్లు– ఎంత లాభముంటే అన్ని ఎపిసోడ్లు తీస్తారు?"

ఆ పాయింట్ డిస్కస్ చేసేసరికి మెజారిటీ సభ్యులు టీవీ సీరియల్ తీసే వేపే మొగ్గారు.

"అంతేకాదు– మన సీరియల్లో చాలా వరకూ మన కాలనీలో ఉన్నవాళ్ళనే నటీనటులుగా తీసుకోవచ్చు–" అన్నాడు జనార్ధన్– తన ఫ్యూచర్ గురించి ఆలోచిస్తూ–

"ఇంకో అడ్వాంటేజ్ ఏంటంటే– ఆ సీరియల్ నేను డైరెక్షన్ చేస్తాను గనుక జనానికి చాలా ఎట్రాక్షన్‌గా ఉంటుంది–" అన్నాడు బోసుబాబు ముందు కొస్తూ– బోసు బాబు చాలా సంవత్సరాల కిందట ఒక సినిమా తీశానని చెప్తూంటాడు గానీ ఆ సినిమా గురించి మా కాలనీలో ఎవరికీ తెలీదు–

"వద్దూ– ఆ చెత్త సినిమాని డైరక్ట్ చేసిన వాళ్ళు వద్దూ–" అంటూ యూత్ కొంతమంది వెనుక నుంచి నినాదాలు చేశారు.

దాంతో బోస్ కూర్చుండిపోయాడు.

వెంటనే మా కాలనీ వాళ్ళు కొంతమందితో ఓ కమిటీని ఎనౌన్స్ చేశాడు గోపాల్రావ్.

"శాయిరామ్, రంగారెడ్డి, పార్వతీదేవీ, సావిత్రమ్మా– ఈ నలుగురూ మనం తీయబోయే టీవీ సీరియల్ ఎలా తీయాలీ, టెక్నీషియన్స్ ఎవరు, ఎలాంటి స్టోరీ తీసుకోవాలి అన్న విషయాలు స్టడీ చేసి నిర్ణయాలు తీసుకుంటారు" అన్నాడతను.

ఆ మర్నాడే మా కమిటీ సమావేశమయింది.

"ముందు మనం ఒక మంచి కథను ఎన్నుకోవాలి! ఇప్పుడొచ్చే చెత్త టీవీ సీరియల్స్ లాగా కాకుండా ఒక మంచి సందేశాత్మకమయిన సీరియల్ తీస్తే మన ప్రేక్షకులకు ఎంతో నచ్చుతుంది" అంది సావిత్రమ్మ.

పార్వతీదేవి ఆమెను సపోర్ట్ చేసింది.

మా మీటింగ్ జరుగుతూంటే కిటికీ బయట ఎండలో నిలబడి మావేపు చూస్తూ ఉండుండి చేతులు ఊపుతూ కనిపించాడు చంద్రకాంత్.

"పాపం- ఆ సీరియల్‌కి తననే రచయితగా పెట్టుకోమంటున్నాడు" రంగారెడ్డి చెవిలో ఊదాడు శాయిరామ్.

"ఫోన్లే- ఎంత చెడ్డా కాలనీలో ఉన్న ఏకైక రచయిత కదా! అతన్నే తీసుకుందాం" అన్నాడు రంగారెడ్డి.

ఆ మాటే బయటకు చెప్పాడుగానీ సావిత్రమ్మ ససేమిరా వప్పుకోలేదు.

"చూడండి! కథ విషయంలో మన కాలనీ రచయిత లాంటి పక్షపాతాలు వద్దు- నా ఉద్దేశం ఎలా ఉందంటే టీవీ సీరియల్ అన్నాక లేడీసెంటిమెంట్ అనేది బ్రహ్మాండంగా పండగలగాలి. ఆ కెపాసిటీ ఈ మధ్య సాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన బ్రహ్మకుమారి ఒక్కావిడకే ఉంది-" అందామె.

"అవునవును! ఆవిడ అవార్డ్ నవలనే మన టీవీ సీరియల్‌కి అడాప్ట్ చేసుకుంటే అద్భుతంగా ఉంటుంది-" అంది పార్వతీదేవి.

మేం కూడా ఆ సజెషన్‌కి వప్పుకోక తప్పలేదు. ఎందుకంటే టీవీ సీరియల్స్ అన్నీ జనరల్‌గా లేడీసే చూస్తుంటారు.

సాయంత్రం సీరియల్స్ వచ్చే టైమ్‌లో మగాళ్ళంతా టీవీ సెట్లకు దూరంగా ఎక్కడో పేకాడుకుంటూనో, కబుర్లు చెప్పుకుంటూనో గడుపుతూంటాం! ఆ టీవీ సీరియల్స్, చూడాలంటేనే ఎలర్జీ మాకు!

ఒకసారి గత్యంతరం లేని పరిస్థితుల్లో మేమంతా ఒక టీవీ సీరియల్ చూడాల్సి వచ్చింది.

నిజంగా నరకం అంటే ఏంటో ఆ ఇరవై నిమిషాల్లో తెలిసొచ్చింది మాకు. హీరోయిన్‌కి తోటి కోడలు పాలు తెచ్చిచ్చింది ఒక పనిమనిషిలాగా- ఎందుకంటే హీరోయిన గొప్పింటిది- తోటి కోడలు బీదింటివి- అందుకని ఇంటిల్లిపాదీ తోటికోడల్ని బానిసలాగా చూస్తూంటారు. తమాషా ఏంటంటే ఎన్ని హింసలు పెట్టినా తోటి కోడలు చిరునవ్వుతో హాపీగా భరిస్తూంటుంది తప్ప నోరుతెరవదు. తనకి ఓ చేతికి వాత పెడుతూంటే ఆనందంగా

రెండో చేయి అందిస్తుంది–

"ఒకవేళ ఆ తోటి కోడలు మెంటల్లీ రిటార్డెడ్ ఏమో–" అన్నాడు రంగారెడ్డి.

హీరోయిన్ పాలు తాగబోతోంటే అత్తగారు 'ఆగు' అంటూ గావుకేక పెట్టింది బెడ్‌రూమ్ గడపలోనుంచి.

హీరోయిన్ పాలు తాగటం ఆపేసి అత్తవేపు చూసింది.

అప్పుడే బాత్‌రూమ్‌లోనుంచి స్నానం చేసి బయటికొస్తూన్న హీరో– అక్కడే ఆమె కేక విని ఆగిపోయి తల్లివేపు చూశాడు. మెట్లు దిగుతూ ఆఫీస్‌కెళ్ళబోతూన్న హీరోయిన్ మామగారు మెట్లమీదే నిలబడిపోయి భార్యవేపు చూశాడు.

బయట కారుడ్రైవర్ ఆ కేకకి ఇంట్లో యజమాను రాలివేపు చూశాడు.

తోటమాలి కూడా కిటికీలోనుంచి యజమానురాలిని చూశాడు.

సోఫాకింద పడుకున్న కుక్కకూడా యజమాను రాలివేపు చూసింది. అప్పుడు తోటి కోడలు స్లోమోషన్‌లో– రెండు నిమిషాలు టైమ్ పట్టేట్లు వెనక్కు తిరిగి అత్తగారివేపు చూసింది.

అత్తగారు ఒక్కొక్క అరనిమిషం పాటు వాళ్ళందరి మొఖాలూ చూసింది. మళ్ళీ అందరూ ఆమె మొఖం చూశారు.

"ఆ పాలు తాగకు" అంది అత్తగారు.

అందరూ ఒకరి తర్వాత ఒకరు మళ్ళీ అత్తగారి మొఖంలోకి చూశారు. ఆమె మళ్ళీ అందరి మొఖాల్లోకీ చూసింది.

ఇప్పుడు హీరోయిన్ తన భర్త మొఖంలోకి చూసింది. అతను భార్య మొఖంలోకి చూశాడు.

అందరూ తోటి కోడలు మొఖంలోకి చూశారు.

తోటికోడలు అందరిమొఖాల్లోకీ చూసింది.

తోటమాలీ, డ్రైవరూ మొఖమొఖాలు చూసుకున్నారు.

తోటికోడలూ, మామగారూ మొఖమొఖాలు చూసుకున్నారు.

హీరోయినూ, తోటికోడలూ మొఖమొఖాలూ చూస్తున్నారు.

అత్తగారి మొఖంలోకి, యజమాని మొఖంలోకీ చూసింది కుక్క!

కుక్క మొఖంలోకి చూసింది తోటికోడలు.

హీరోయిన్ మొఖంలోకి చూసింది కుక్క–

మళ్ళీ ఓసారి అందరూ అందరి మొఖాల్లోకీ చూసుకున్నారు–

దాంతో బ్రేక్–

అయిదు నిమిషాలు యాడ్స్ వచ్చాయ్-

ఆ తరువాత అంతకుముందు చూసిన సీనంతా మళ్ళీ చూబించారు.

అప్పుడు అత్త స్లోమోషన్‌లో హీరోయిన్ వేపు నడవటం మొదలుపెట్టింది. ఆమె ఒక్కొక్క అడుగు వేస్తూంటే ఒక్కొక్కరు ఆమె వంకే చూస్తున్నారు. అమె అందరి వంకా చూస్తూ నడుస్తోంది.

ఆ హాల్ చూస్తే ఫిఫ్టీన్ బై థర్టీ ఉంటుంది- కోడలి దగ్గర కెళ్ళడానికి పాతిక మైళ్ళ దూరం నడిచినట్లు నడుస్తోంది అత్తగారు. కెమెరా ఆమెపాదాల మీద కాసేపు - ఆమె నడుము మీద కాసేపు- ఆమె ఛాతీమీద కాసేపు- మొఖం మీద కాసేపు-

అయిదు నిమిషాలకుగానీ హీరోయిన్ కూర్చున్నచోటకు చేరుకోలేకపోయిందామె.

చేరుకోగానే ఆ పాలగ్లాస్ వంక చూసింది.

ఇప్పుడు అందరి మొఖాలూ పాలగ్లాస్‌లోకి-

పాలగ్లాస్ కూడా అందరిమొఖాల్లోకీ చూస్తోంది.

"ఎందుకత్తయ్యా- తాగొద్దంటున్నావ్?" అడిగింది హీరోయిన్. మళ్ళీ అందరూ హీరోయిన్ అత్తవేపు చూశారు. ఆమె అందరివేపూ చూసింది.

తరువాత తోటి కోడలు మొఖంలోకి చూసింది.

తోటికోడలు అందరి మొఖాల్లోకీ చూసింది.

"ఎందుకంటే...." అంటూ సగంలో డైలాగ్ ఆపింది. దాంతో అందరూ ఒక్కొక్కరుగా మళ్ళీ ఆమె వేపు చూశారు.

ఆమె మళ్ళీ అందరివేపూ చూసింది.

తోటికోడలు మొఖంలో భయం-

"ఎందుకంటే- నువ్ చేసిన నికృష్టమయిన పనికి-" దాంతో తోటికోడలు మొఖంలో రకరకాల ఎక్స్‌ప్రెషన్స్- అందరూ తోటికోడలు వేపు సపరేట్‌గా చూశారు. తోటికోడలు సపరేట్‌గా అందరివేపూ చూసింది.

"ఎందుకంటే నువ్ చేసిన నికృష్ఠమయిన పనికి-" అనే డైలాగ్ ఆ హాలంతా అన్నీ కార్నర్స్‌లో మార్మోగిపోయింది.

"నేనేం చేశానత్తయ్యా-" ఏడుపు ఆపుకుంటూ అడిగింది తోటికోడలు-

అందరి మొఖాలో సస్పెన్స్- అందరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు. కిటికీలోనుంచి తోటమాలి- బయటనుంచి కారు డ్రైవర్ కూడా ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"ఏం చేశావా?" అంటూ మళ్లీ అరచింది అత్త- మళ్ళీ అందరూ తోటికోడలివేపు చూశారు- తోటికోడలు హీరోయిన్ వేపు చూసింది. హీరోయిన్ బాత్‌రూమ్ డోర్‌లో

గంటసేపట్నుంచీ టవల్ కట్టుకు నిలబడ్డ భర్తవేపు చూసింది. భర్త తండ్రి వేపు చూశాడు. తండ్రి కుక్కవేపు చూశాడు. కుక్క పాలగ్లాస్ వేపు చూసింది.

"సుష్మితకు పాలిచ్చే ముందు డాక్టరిచ్చిన టాబ్‌లెట్ ఇమ్మని చెప్పాను కదా-"

అంతవరకూ చూశాక మేము టీవీ ఆఫ్ చేసి బయటపడ్డాం- ఆ తరువాత ఆ నరకాన్ని మర్చిపోడానికి వారంరోజులపాటు సాయంత్రాలు ఫుల్‌గా మందుకొడితేగానీ మర్చిపోవటం కుదర్లేదు.

ఎలాగయితేనేం- రెండు రోజుల్లో టీవీ సీరియల్‌కు కథ తయారయింది. దానికి చంద్రకాంత్ తోనే డైలాగులు రాయించాం!

వెంటనే టీవీ సీరియల్స్ తీయటంలో అనుభవం ఉన్న ఒక డైరక్టర్‌ని తీసుకొచ్చి అయిదు ఎపిసోడ్‌లు షూటింగ్ చేయించాం.

షూటింగ్ అంతా మా కాలనీలోనే జరిగింది.

జనార్ధన్ మెయిన్‌రోల్ వేస్తానని పట్టుపట్టాడు గానీ అతనిని అందరం కలసి బ్రతిమాలి హీరోయిన్ అన్నగా వేయించాం!

మిగతా నటీనటుల్లో చాలామంది మా కాలనీలో ఉండేవాళ్ళే. ఎందుకంటే అందరికీ టీవీలో ఏదొక కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసిన అనుభవం ఉంది.

అసలు మాకే ఆశ్చర్యం వేసింది- ఇన్ని వందల మంది అప్పటికే వివిధ చానెల్స్‌లో ఏదొక ప్రోగ్రాంలో అనుభవం సంపాదించారంటే-

ఆ తర్వాత ఎడిటింగ్, మ్యూజిక్ అన్నీ అయాక కాలనీ వాళ్ళందరం కలసి ఒకసారి ఆ అయిదు ఎపిసోడ్‌లూ మా కమ్యూనిటీ హాల్లో ఓ పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ మీద చూశాం!

అన్ని సీన్స్‌లో మా కాలనీవాళ్ళూ, వాళ్ళ పిల్లలూ ఒకటి రెండుసార్లు కనబడటంతో అందరూ ఆ సీరియల్ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు.

అంతమంచి వెరయిటీ సీరియల్- పైగా అశ్లీలం, అవాంఛనీయమయిన సన్నివేశాలేమీ లేకుండా- ఇవన్నీ కాకుండా ఓ మంచి సామాజిక సృహతో, ఒక సోషల్ పర్పస్‌తో కథనం ఉన్నందుకు అందరూ మా కమిటీని అభినందించారు. వెంటనే విజృంభించిన ఉత్సాహంతో దాని మార్కెటింగ్ గురించి ప్రయత్నాలు ప్రారంభించాం.

"సీరియల్ చాలా గొప్పగా తీస్తున్నాం గనుక కనీసం ఒక ఎపిసోడ్‌కీ లక్షన్నర లేందే ఏ చానెల్‌కీ ఇవ్వగూడదు" అన్నాడు రంగారెడ్డి.

"ఏ చానెల్‌కిద్దాం?" అడిగాడు శాయీరామ్.

"ముందు చాలా ఫేమస్ చానెల్ చిమ్మీ చానెల్ కాబట్టి దానికే ఇద్దాం! మనస్టేట్‌లో లేడీస్ అంతా ఆ చానెలే చూస్తున్నారు-" అంది సావిత్రమ్మగారు.

ఒక మంచి రోజ్జూసుకుని అందరం చిమ్మీ చానెల్‌కెళ్ళాం.

టీవీ సీరియల్స్ ఇన్‌ఛార్జ్ భోలామోహన్‌ని కలుసుకోవాలని రిసిప్షనిస్ట్‌కి చెప్పాం.

"ఇవాళ కుదర్దు– వారం తర్వాత రండి–" అందామె.

"వారం తర్వాతా?"

"అవును–"

"ఇప్పుడెందుకు కుదర్దు?"

"పొద్దున్న ఆయనెవరినీ చూడడు–"

"ఎందుకని? హెల్త్ ప్రాబ్లెమా?"

"అది మీకవసరమా?"

"చాలా అవసరం ఎందుకంటే మేము సిటీ బయట ఉండే నిర్భయ్‌నగర్‌కాలనీ నుంచివచ్చాం! తెల్లారుజామున నాలుగింటికి లేచి బయల్దేరితేనే ఈ ట్రాఫిక్‌లో ఇప్పటికి మీ ఆఫీస్ చేరుకోగలిగాం! ఇవాళ కుదర్దన్నారంటే– మళ్ళీ మేము వచ్చే వారం కూడా ఆఫీసులు మానేసి తెల్లారుజామున నాలుగుకి లేవాల్సివస్తుంది."

"అయామ్ సారీ – ఈ వారం కుదర్దు–"

ఏం చేయాలో మా కర్థం కాలేదు. ఆ రిసిప్షనిస్ట్‌ని తిట్టుకుంటూ బయటకు నడుస్తోంటే మాకు పరిచయమున్న ఒకతను చిమ్మీ చానెల్ అన్న అక్షరాలున్న యూనిఫారంతో కనిపించాడు.

"నమస్తే అన్నా– మా చానెల్ కొచ్చిన్రేంది సంగతి?" అప్యాయంగా పలుకరించాడు అతని పేరు రవి.

అతను మా కాలనీలో కొంతకాలం అద్దెకుండి తర్వాత "ఛా– నీయవ్వ కాలనీ– బస్‌లో ఆఫీస్‌కి పోయిరావాల్నంటే ఒకరోజంతా పోతోంది–" అంటూ సిటీలో ఇరుకయిన గది తీసుకుని షిఫ్టయిపోయాడు.

వెంటనే రవికి విషయమంతా చెప్పాం–

"రిసెప్షనిస్ట్ చెప్పిన మాట నిజమే అన్నా! భోలామోహన్ సాబ్ మాణింగ్ టైమ్‌లో ఎవ్వరినీ చూడడు–"

"ఎందుకని?"

"మీకు తెలీందేమున్నా! మధ్యాహ్నం పన్నెండింటివరకూ హాంగోవర్‌లో ఉంటాడు. దినాం రాత్రుళ్ళు పార్టీలుంటయ్ కదా–"

"బాబ్బాబు! ఈ ఒక్కసారికీ హాంగోవర్‌తోనే మాతో మాట్లాడమను– మేమేం అనుకోం. గవర్నమెంట్ ఆఫీసుల్లో మొత్తం హాంగోవర్ కేస్‌లే కదా! అందరికీ తెల్సిన సంగతే–

అసలు మన గవర్నమెంటే కిందటి ఎలక్షన్ల హాంగోవర్‌లో వర్క్ చేస్తోంది–" బ్రతిమాలాడు రంగారెడ్డి.

రవి తలగోక్కున్నాడు.

"కానీ ఆ సారేమంటాడో ఏమో–"

ఇండియాలో సీరియస్ డిస్కషన్స్ అవుతున్నప్పుడు మధ్యలో ఎవడైనా తలగోక్కున్నాడూ అంటే అర్థం ఒక్కటే!

ఆ అర్థం మాకర్థమయింది గనుక వెంటనే ఒక అయిదొందల నోటు తీసి రవి జేబులో కుక్కాం!

"బాబ్బాబు– ఎలాగోలా పని కానీ–"

"ఈ అయిదొందల్లో ఒక క్వార్టర్ తీసుకెళ్ళి సార్‌కే ఇస్తా! అప్పుడు హాంగోవర్ దిగుద్దేమో– ఓ పని చేయండి– మీరిక్కడే కూర్చోండి–" అంటూ వెళ్ళి అరగంటలో తిరిగివచ్చాడు.

"రండి– సార్ పిలుస్తున్నారు–"

అందరం రూమ్‌లో కెళ్ళాం!

"త్వరగాచెప్పండి! పావుగంటే టైముంది– తర్వాత మీటింగ్ కెళ్ళాలి–" అన్నాడతను కొంచెంగా తూగుతూ–

వెంటనే పార్వతీదేవి చెప్పటం మొదలుపెట్టింది.

"మా సీరియల్‌కి కథ సాహిత్య అకాడెమీ బహుమతి ఇచ్చిన నవల నుంచి తీసుకున్నాం సార్! ఆ నవల రాసిన రచయిత్రి బ్రహ్మకుమారి– మన రాష్ట్రమంతా చాలా పేరు ప్రఖ్యాతులున్నయ్ ఆమెకి–"

"స్టాప్" అన్నాడతను చేయి పైకెత్తుతూ–

పార్వతీదేవి షాకయి ఠక్కున ఆపేసింది.

"షూడండి! స్టోరీ ఎవర్రాశారు? ఆ నవల కెన్ని బహుమతులొచ్చినయ్– ఎందుకొచ్చినయ్– ఎలా వచ్చినయ్– ఇదంతా మాకనవసరం!" అన్నాడతను.

వెంటనే రంగారెడ్డి అందుకున్నాడు.

"ఇక డైరక్షన్ గురించి చెప్పాలంటే– ఫేమస్ టీవీ సీరియల్ డైరెక్టర్ కేకేయస్ వనమాలిగారు డైరక్ట్ చేశారు–"

మళ్ళీ స్టాప్ అంటూ చేయి పైకెత్తాడు బోళామోహన్.

రంగారెడ్డి ఆపేశాడు.

"ఎవడు డైరక్ట్ చేశాడూ" అనేది కాదు మాక్కావలసింది. ఎలా చేశాడూ అనేదే

ముఖ్యం–"

"చాలా బాగా చేశాడ్సార్–"

"స్టాప్! ఆ సంగతి చెప్పాల్సింది మీరు కాదు. మా స్క్రీనింగ్ కమిటీ!"

"అలాగే సార్–"

"కథేంటో చెప్పనా సార్?" ఉత్సాహపడింది సావిత్రమ్మ.

"నాక్కాదు. మా క్రియేటివ్ హెడ్ మీనాభజన్ గారిని కలుసుకుని చెప్పండి!"

"ఓకేసార్!"

అతను వెంటనే మీనాభజన్ అనే ఆమెకు ఫోన్ చేశాడు.

"మీనాజీ! వీళ్ళెవరో సీరియల్ తీశారంట– ఒకసారి మాట్లాడండి–"

"ఓకే–"

"వెళ్ళండి!" అన్నాడతను.

అందరం మీనాభజన్ చాంబర్ వెతుక్కుంటూ బయల్దేరాం– చివరకు ఓ మూల కనిపించిందది–

"ఆ పేరు ఎక్కడో విన్నానే" అంది పార్వతీదేవి అప్పుడే అటువచ్చిన రవితో.

"ఇంతకుముందు తుగ్లక్ చానెల్లో పనిచేసేది మేడమ్! అక్కడి స్క్రిప్ట్ ఇన్‌ఛార్జ్‌గా ఉండేది. కొంతమంది బిగ్ షాట్స్‌ని ఇంటర్వ్యూ కూడా చేస్తూండేది–" చెప్పాడు రవి.

దాంతో అందరికీ గుర్తుకొచ్చేసింది.

"మరి ఆ చానెల్లో మానేసి ఈ చిమ్నీ చానెల్లో కెందుకొచ్చింది?"

"అక్కడ సీరియల్ ప్రొడ్యూసర్లందరి దగ్గరా డబ్బు ఎక్కువగా తీసుకుని– మిగతా హెడ్స్‌కి తక్కువ షేర్ ఇచ్చిందంట– టూమచ్ ఫ్రాడ్ అని డిస్మిస్ చేశారు"

మాకు మతిపోయినట్లయింది.

"చానెల్స్‌లో కూడా గవర్నమెంట్ ఆఫీసుల్లాలాగా అవినీతి ఉంటుందా?"

రవి పగలబడి నవ్వాడు.

"సిటీ బయట కాలనీలో ఉంటే ఇదే ప్రాబ్లెమ్ సార్! ఎక్కడేం జరుగుతోందో ఎవరికీ తెలీదు. నేనందుకే పారిపోయి సిటీలో కొచ్చా!"

"అది సరేగానీ నాకిక్కడో విషయం అర్థం కావటం లేదు..." అన్నాడు శాయిరామ్.

"ఏంటది?"

"అదే– తుగ్లక్ చానెల్లో ఆమె పరమ ఫ్రాడ్‌స్టర్ అని డిస్మిస్ చేశారు కదా! మరి అలాంటి ఆమెకు చిమ్నీ చానెల్ వాళ్ళు ఎలా జాబ్ ఇచ్చారు?"

మళ్ళీ విరగబడి నవ్వాడు రవి.

"ఎంత వెనుకబడి ఉన్నారు సార్ మీ కాలనీవాళ్ళు? ఎప్పటికి అభివృద్ధి చెందుతారో ఏమో– మిమ్మల్ని చూస్తే ఎంతో జాలిగా ఉంది నాకు–"

వాడలా అంటూంటే మాకు చాలా ఇన్సల్ట్ అనిపించింది గానీ వాడు చెప్పేది ఫాక్టే గనుక ఎదురు మాట్లాడలేకపోయాం.

"చూడండి సార్! ఇది కార్పొరేట్ వరల్డ్! ఇక్కడ గవర్నమెంట్‌లో లాగా ఎవడు నీతిపరుడు– ఎవడు అవినీతిపరుడు అనే విషయం ఎవడూ పట్టించుకోడు. అసలు కార్పొరేట్ అంటేనే కర్రప్షన్. వాళ్ళ ఒక ఇండస్ట్రీ పెట్టాలంటే ముందు ఆ ఇండస్ట్రీకి సంబంధించిన మినిష్టర్‌కి లంచాలిస్తారు– ఆ తరువాత ముఖ్యమంత్రికి లంచాలిస్తారు. ఆ ఏరియా ఎంపీకీ, ఎమ్మెల్యేకీ, పోలీసాఫీసర్లకూ అందరికీ ఎవరి వాటా వారికిచ్చేస్తారు. అంటే అవినీతినే పెట్టుబడిగా పెట్టి ఆ కార్పొరేషన్ స్టార్ట్ చేస్తారన్నమాట. ఆ లెవల్లో పనిచేసే చానెల్ వాళ్ళు మరి స్టాఫ్‌ని ఎలాంటి వాళ్ళను సెలక్ట్ చేసుకుంటారు? అందరిలోకీ అవినీతి మొనగాడెవడో వాడే కావాలి వాళ్ళకు– ఎంత గొప్ప అవినీతి పరుడుంటే కార్పొరేషన్స్‌కి అంతలాభం! ఎందుకంటే అవినీతినే ఆయుధంగా ఉపయోగించుకుని వాళ్ళు కార్పొరేషన్‌కి లాభాల పంట పండిస్తారు–

ఆ సమయంలో వాడు శ్రీకృష్ణుడులాగానూ, మేమంతా అర్జునుళ్ళాగానూ వాడు చెప్పేది భగవద్గీతలాగానూ మాకనిపించింది.

"ఉదాహరణకి ఒక కార్పొరేషన్ తమ కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌ని టూమచ్ ఆఫ్ అవినీతి పరుడని డిస్మిస్ చేసిందనుకోండి, దానర్థం ఏమిటి? వాడు ఎంత పెద్ద పదవిలో ఉన్నవాడినయినా డబ్బుతో పడేయడానికి– గల సామర్థ్యం ఉన్నవాడూ అని. ఒకవేళ డబ్బుకి లొంగని వాళ్ళుంటే– వాళ్ళని పడేయడానికి వాడికి సపోర్ట్‌గా పాతికమంది తారా చౌదరిలు రాత్రింబగళ్ళు పనిచేస్తూంటారు–

పోలీసాఫీసర్లూ, ఇన్‌కమ్‌టాక్స్‌వాళ్ళూ, సెంట్రల్ ఎక్సయిజ్‌వాళ్ళూ, మినిష్టర్లూ, ఎమ్మెల్యేలు, ఎంపీలూ, ఒకరేంటి– మొత్తం దేశం ఆ అవినీతి వైస్‌ప్రెసిడెంట్ గుప్పిట్లో ఉంటుందన్నమాట!

అలాంటి వాడిని ఒక తెలివి తక్కువ చానెల్ డిస్మిస్ చేసిందంటే వెంటనే మిగతా చానెల్స్ పోటీలుపడి ఎక్కువ జీతమిచ్చి ఎక్కువ హోదా ఇచ్చి అపాయింట్ చేసుకుంటా యన్నమాట!– అంచేత మీనాభజన్ లాంటి వాళ్ళు లైఫ్‌లాంగ్ ఫుల్ డిమాండ్‌లో ఉంటారు– అర్థమయిందా సార్–"

రంగారెడ్డి ఆ లెక్చర్‌కి ఎంత ఉత్తేజితుడయాడంటే ఆమాంతం లేచి వాడిని కౌగలించు కున్నాడు.

“ఓరే రవీ! వయసులో మాకంటే ఎంతో చిన్నవాడివయినా ఎంత కాచి వడబోశావ్‌రా– మన ఇండియాని! ఇంతకాలం మన కాలనీలోని వాళ్ళందరం– శుంఠ వెధవల్లాగా, అవినీతి పరులనే వాళ్ళు సమాజానికి చీడపురుగులన్న భ్రమలో ఉన్నాం– అంతే కాదు. అవినీతి పరుల్ని మొత్తం సమాజం నీచంగా చూస్తుంది, ఒకసారి అవినీతి పరుడు అని ముద్రపడిన వాడిని జీవితాంతం ఎవరూ తమ దరిదాపులకు కూడా రానివ్వరు అనే తెలివితక్కువ ఊహల్లో ఉన్నం! ఈ తెలుగు చానెల్లో చేరి ఎంత విజ్ఞానం సంపాదించావ్‌రా నువ్వు! ఎంతో మేధావి వయ్యావురా నువ్వు!”

వాడు మావేపు చాలా జాలిగా చూశాడు.

“అరెరె– అలా ఫీలవకండిసార్! ఈ టీవీ సీరియల్ తీస్తున్నారు కదా ఎలాగో– ఇది పూర్తి చేసేప్పటికి మీక్కూడా బోలెడు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుంది– అప్పుడు మీరిక అవినీతిని అసహ్యించుకోరు– బూతుని ద్వేషించరు– వ్యభిచారాన్ని చూసి కళ్ళుమూసుకోరు– పైపెచ్చు వీటన్నిటినీ అరాధిస్తారు– రియల్ లైఫ్ అంటే అదేసార్! కనువిప్పు కలిగాక మూడు కోతులు బొమ్మలు కొత్త సిద్ధాంతాలు భోదిస్తాయ్‌సార్– చెడులేని ప్రదేశాలను చూడకు– అంటుంది కళ్ళు మూసుకున్నకోతి– చెడు, బూతులేనిమాటలు, ఉపన్యాసాలు వినకు– అంటుంది చెవులు మూసుకున్నకోతి. చెడునే పలుకు– అవినీతినే బోధించు– ఒకవేళ నీతిసూత్రాలను వల్లించాల్సిన దురవస్థ కలిగినప్పుడు– నోరుమూసుకో– అంటుంది మూడోకోతి!

ఇవన్నీ ఆచరించటం మొదలుపెట్టారను కోండి! మీరు కూడా ఏరాజా, కనిమోళి, కల్మాడీ, మన రాష్ట్రంలో శ్రీలక్ష్మిలా– కర్నాటకలో మైనింగ్‌గాలిలా బిలియనీర్స్ అయిపోతారు.

“కానీ వాళ్ళందరూ జైల్లో ఉన్నారుగా?”

“లక్షల కోట్లు సంపాదించి మనవాళ్ళందరి పేర్లమీదా ఆస్తులు సంపాదించాక– నాల్రోజులు జైల్లో ఉంటే ఏమైందిసార్! ప్రజాస్వామ్యంలో ఈ పోలీసులూ, కోర్టులూ– ఎల్లకాలం ఎవ్వరినీ జైల్లో ఉంచరు– అలాంటి వాళ్ళను రక్షించడానికే క్షమాభిక్ష స్కీమ్‌లు న్నాయ్. గాంధీ జయంతులున్నాయ్. వాళ్ళవల్ల లాభం పొందిన రాజకీయ నాయకులే హోమ్ మినిష్టర్‌లూ, ముఖ్యమంత్రులూ అవుతారు– అప్పుడు మిమ్మల్ని విడుదల చేస్తే ఎవరడ్డొస్తారు?”

“మరి వాళ్ళను వదిలేస్తే ప్రజలూరుకుంటారా?”

రవి మళ్ళీ పగలబడి నవ్వాడు.

“తెలివితక్కువ వాగుడంటే అదే సార్! ప్రజలంటే ఎవర్సార్– పైన్నుంచి దిగొచ్చారా?

వాళ్ళూ మెజారిటీ అవినీతిపరులే సార్! లంచాలివ్వటం– లంచాలు తీసుకోవటం వాళ్ళ ఊపిరి! అందుకే వాళ్ళూ అవినీతిపరులనే ఎన్నుకుంటారు– ములాయంసింగ్ వెనుక భయంకరమయిన గూండాలున్నారని ప్రజలందరికీ తెలుసు– అయినా అతన్నే థంపింగ్ మెజారిటీతో గెలిపించారా లేదా? అలాగే ఎన్ని అవినీతి ఆరోపణలున్నా జగన్ కాంగ్రెస్‌కి నెల్లూర్‌లో పట్టం కట్టరాలేదా? కనుక ప్రజలూరుకుంటారా? అంటూ చిల్లర్ కొశ్చెన్స్ వేయకండి!"

మేము మాట్లాడుతూండగానే మీనాభజన్ నుంచి లోపలకు రమ్మని మాకు ఆహ్వానం వచ్చింది–

అందరం లోపలికెళ్ళి సోఫాల్లో కూర్చున్నాం!

అప్పటికే ఆమె ఎవరో టీవీ ప్రొడ్యూసర్‌తో ఫోన్‌లో మాట్లాడుతోంది.

"మీకేమయినా కామన్ సెన్సుందా? ఇప్పటికి పాతిక ఎపిసోడ్స్ టెలికాస్ట్ అయ్యాయ్. అయినా కూడా ఒకే మొగుడు ఒకే పెళ్ళాంతో ఈ పాతిక ఎపిసోడ్స్ నుంచీ వదలకుండా కాపురం చేస్తున్నాడు. హీరో తల్లి కారెక్టర్‌కి పెళ్ళికి ముందు ఇంకెవడితోనో ప్రేమకలాపాలు జరిపి– ఒక పిల్లడిని కని అనాథాశ్రమంలో ఇచ్చేసిన ఫ్లాష్‌బాక్‌లేదు.

హీరో తండ్రికి వేరే ఊళ్ళో సెకండ్ సెటప్ లేదు– హీరోయిన్ చెల్లెలు ఈ పాతిక ఎపిసోడ్స్ నుంచీ ఒకే బాయ్‌ఫ్రెండ్‌తో తిరుగుతోంది. ఇలా లవ్‌ట్రయాంగిల్స్ డబుల్ ట్రాయింగిల్స్– రివర్స్ ట్రయాంగిల్స్ లేకుండా ఆదెక్కడి సీరియలండీ? ఈ సీరియల్ ఇలాగే నడుస్తే ప్రేక్షకులు చెప్పు తీసుక్కొడతారు–"

"ఎవర్నండీ?"

"ఎవర్నేమిటి? మిమ్మల్నే! ఈ రోజుల్లో వ్యూయర్స్ ఎంత ఫాస్ట్‌గా ఉన్నారో గ్రహించకపోతే ఎట్లా?– ఏంటీ? ఏం చేయమంటారా? కథ కూడా క్రియేటివ్ హెడ్డే చెప్తే ఇంక ప్రొడ్యూసర్లెందుకండీ– అడుక్కుతినడానికి? పెట్టండి. వల్గర్ సినిమాలకు కథలు రాసే రచయితలుంటారు. అలాంటి వాళ్ళను పట్టుకుని డబ్బిచ్చి కథ మార్పించండి! మందు తాగిస్తే మర్డర్స్ చేసే బాచ్ ఒకటుంది. వాళ్ళను పట్టుకుని వాళ్ళతో క్రైమ్‌యాంగిల్ రాయించండి– ఓకే?"

ఫోన్ పెట్టేసిందామె కోపంగా.

మా గుండెలు ఝల్లుమన్నాయ్.

అలాంటి నికృష్టమయిన కథలల్లి టీవీ సీరియల్ తీయాలన్న నాలెడ్జ్ మాకులేదు.

ఇప్పుడు మా స్టోరీ వింటే ఏమంటుందో ఏమో!

మీనాభజన్ మావేపు చూసింది.

"యస్- ఎవరు మీరు?"

"మాది నిర్భయ్‌నగర్ కాలనీ మేడమ్! మా గురించి రవి మీతో చెప్పానన్నాడు-"

"ఓ రవి చెప్పిన పార్టీయా?"

"అవును మేడమ్- మేము చాలామంచి ఫామిలీ సీరియల్ తీశాం మేడం-"

"ఫామిలీ సీరియలా?" గాబరాగా అడిగిందామె.

"అవును మేడమ్- అంటే ఫామిలీ అంతా- తల్లీ తండ్రీ, పిల్లలూ, అన్నావదినెలు, కొడుకూ కోడళ్ళూ, కూతురూ అల్లుళ్ళూ- అంతా కలిసి కూర్చుని హాపీగా చూసే ఫామిలీ టైప్ స్టోరీతో తీసిన సీరియల్ మేడమ్-"

ఆమె తలకొట్టుకుంది.

"ఛఛచ! ప్రొఫెషనల్స్ కానివాళ్ళు సీరియల్స్ తీస్తే ఇలాగే ఉంటుంది. ఫామిలీ టైప్ సీరియల్స్ అంటారేంటి? అసలు కంబైన్డ్ ఫామిలీస్ ఎక్కడున్నయ్ మన దగ్గర? ఫాదర్ మందుకొడుతూంటాడు- తల్లి టీవీ ముందుంటుంది. కాలేజ్ గోయింగ్ పిల్లలుంటే వాళ్ళరూమ్‌లో ఇంకో టీవీలో హిందీ చానెల్స్ లేదా ఇంగ్లీష్ చానెల్స్ చూస్తూంటారు- లేదా పిల్లలు అమెరికాలో ఉంటారు. ఇంకా ఫామిలీ ఎక్కడుంది?" చిరాగ్గా అంది.

మాకు మాట రాలేదు కాసేపు.

ఆలోచిస్తే ఆమె చెప్పింది నిజమే అనిపించింది.

ఇప్పుడు కంబైన్డ్ ఫామిలీస్ ఎక్కడున్నయ్?

ఉన్నా సెపరేట్ సెటప్‌లు-

సిటీ బయట తల్లీదండ్రీ ఒక ఫ్లాట్‌లో- హైటెక్ సిటీ దగ్గర ఫ్లాట్‌లో కొడుకూ, కోడలూ, ఇంకెక్కడో కూతురూ అల్లుడూ- ఇంకో ఏరియాలో తమ్ముడూ- మరదలూ- మా కాలనీలో పరిస్థితే అలా ఉంది ప్రస్తుతం-

"ఆల్‌రైట్! ఈ సీరియల్ కాన్సెప్ట్ ఏంటి?" ఆమె అడిగింది మళ్ళీ.

"రోజురోజుకీ కుటుంబ బంధాలు వ్యాపారాత్మకం అయిపోతున్నాయ్ కదండీ! దానివల్ల మనిషి జీవితంలో ఎన్ని సమస్యలొస్తోందీ--.."

"చాల్చాలు- అర్థమయింది- పాత చింత కాయపచ్చడి సబ్జెక్ట్ అన్నమాట! ప్రొఫెషనల్స్ కానివాళ్ళతో ఇదే న్యూసెన్స్- మీరనే కాదు- మీలాంటివాళ్ళు చాలామంది ఇలాంటి చెత్త సబ్జెక్ట్స్‌తో వస్తున్నారు. అవన్నీ అవుట్ డేటెడండీ! ఒకసారి మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడండి! ఎలాంటి వింతలు విడ్డూరాలు జరుగుతున్నాయో, ఎలాంటి ఆశ్చర్యకరమయిన సంఘటనలు జరుగుతున్నాయో- అలాంటి సబ్జెక్ట్స్ కావాలి! రివల్యూషనరీ థీమ్స్ రావాలి!- ఓకే! మీ స్టోరీలో క్రైమ్ ఎలిమెంట్ ఉందా?"

"క్రైమా? ఫామిలీ సీరియల్లో క్రైమ్ ఎందుకుంటుంది మేడమ్? ఫామిలీ అంటే సెంటిమెంట్ ముఖ్యం కదా?"

"మీకేమయినా మెంటలా? క్రైమ్ యాంగిల్ లేని ఫామిలీస్ ఎక్కడున్నాయ్ ఇప్పుడు? న్యూస్ పేపర్స్, టీవీ చానెల్స్ చూట్టంలా- మీరు? మొగుడూ, మరదలూ కలిసి పెళ్ళాన్ని మర్డర్ చేసేస్తున్నారు. మరిది వదినతో అక్రమ సంబంధం పెట్టుకుని ఆమె భర్తను- అంటే తన స్వంత అన్నను లేపేస్తున్నాడు. ఒకడు ఫ్రెండ్ భార్యతో సంబంధం పెట్టుకుని అభ్యంతరం చెప్పిన ఆమె అత్తామామలను పైకి పంపించేస్తున్నాడు. తను పెళ్ళి చేసుకుందా మనుకున్న అబ్బాయి ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నాడన్న విషయం తెలిసి ఆ అమ్మాయి గూండాల గాంగ్‌కి డబ్బిచ్చి ఆ అమ్మాయిని లేపేయమంటుంది. తీరా ఆ అమ్మాయిని ఆ గూండాగాంగ్ లీడర్ మర్డర్ చేయబోతూ ఆ అమ్మాయితోనే లవ్‌లోపడతాడు. దాంతో కథ రివర్స్ అవుతుంది. ఇప్పుడా డాన్ తనకు డబ్బిచ్చిన అమ్మాయినే లేపేయడానికి ప్లాన్ చేస్తాడు.

ఇదీ ఫామిలీ సీరియలంటే-

అక్క స్వంత చెల్లెల్ని ఏదొక కారణంగా మర్డర్ చేయాలి. తల్లి కూతురి సంసారం చెడగొట్టాలి. తండ్రి కోడల్ని మర్డర్ చేసి కొడుక్కి ఇంకో అమ్మాయితో పెళ్ళి చేయడానికి ప్రయత్నించాలి. భార్య భర్తను నరికేయాలి. భర్త భార్యమీద కోపంతో తనుకన్న పిల్లల్ని నరికి పారేయాలి-

ఇదీ ఫామిలీ సబ్జెక్టంటే- అర్థమయిందా?"

"కానీ మీరు చెప్పిన సంఘటన లేమీ ఏ ఫామిలీలోనూ జరగ్గా మేము చూళ్ళేదు మేడమ్- ఒకవేళ ఎక్కడో చోట జరిగినా అది సాధారణం కాదు! చాలా రేర్‌గా జరిగేది-"

"అందుకే- అందుకే - అందుకే- అలాంటి సంఘటనలే మన ఫామిలీస్‌కి కావాలి. ఎందుకంటే అలాంటి తీరని కోరికలతో- ఫామిలీలో అందరూ రగిలిపోతూ ఉంటారన్న మాట. ఛాన్స్ దొరికితే అలాంటి నేరాలన్నీ చేయడానికి అందరి మనసులూ ఉవ్విళ్ళూరు తుంటాయన్నమాట! అలాంటి అక్రమ సంబంధాల కోసం వెర్రెత్తి పోతూంటారన్నమాట! అందుకే మన ఫామిలీ మెంబర్స్ లోపల అణగారిపోయి ఉన్న ఆ కోర్కెలను మనం సీరియల్స్ ద్వారా బయటపెట్టాలి- అప్పుడేవాళ్ళు సీరియల్స్‌ని ఎంజాయ్ చేయటం మొదలె పెడతారు. వాళ్ళు చేయలేక పోయిన పనిని ఆ సీరియల్లో పాత్రలు అవలీలగా చేసేస్తూంటే ఆ పాత్రల్లో తమని ఊహించుకుని ఈ సీరియల్‌కి బానిసలయి పోతారన్నమాట! అర్థమయిందా?"

"అయింది గాని మేడమ్- మీరు చెప్పిన లక్షణాలన్నీ మెంటల్ వాళ్ళకుంటాయ్.

సాధారణంగా పెరీనార్మ్ అంటారనుకుంటాను ఆ వ్యాధి పేరు–" కొంచెం ఎదురు తిరుగుతూ అన్నాడు గోపాల్రావ్.

"ఎగ్జాక్ట్లీ! వ్యూయర్స్ ఒరిజినల్‌గా పిచ్చివాళ్ళా, లేక సీరియల్స్ చూడటం వల్ల అలా అయారా అనేది మనకు అనవసరం!"

"అంటే మీరు చెప్పిన మార్పులు చేస్తే సీరియల్‌ని ఓకే చేస్తారా మేడమ్?" అడిగింది పార్వతీదేవి ఆశగా.

"అప్పుడేనా? ఇంకా చాలా మార్పులు చేయాలి! తండ్రికి అక్రమ సంబంధం ద్వారా పుట్టిన కూతురు అనుకోని పరిస్థితుల్లో ఆ ఇంట్లో దిగాలి. ఆ తల్లికి పెళ్ళికిముందు అక్రమ సంబంధం ద్వారా పుట్టిన కొడుకు ఆ అమ్మాయిని ద్వేషించాలి!...."

"అంటే అక్రమ సంబంధాలు లేని మనుషులెవరూ మన తెలుగిళ్ళల్లో ఉండరంటారా?" కోపం అణచుకుంటూ అడిగింది పార్వతీదేవి–

"నాక్కావలసింది కొశ్చెన్స్ కాదు– నేను చెప్పినట్లు చేస్తారా లేదా అనేది నాక్కావాలి! అంతే!"

"ఇంతేనా మేడమ్? ఇంకేమయినా చేర్చాల్సిన పాయింట్స్ ఉన్నాయా?"

"లేకపోవటమేమిటి? హీరోయిన్ సాధాసీదాగా ఉండకూడదు. అసలు సీరియల్ ఓపెనింగే ఆమె శోభనం రాత్రితో మొదలవ్వాలి! ఆమె భర్త నపుంసకుడని ఆమెకు తెలియటమే ఎపిసోడ్ ఎండింగ్ బాగ్ అన్నమాట–"

మేమందరం షాకయి మొఖాలు చూసుకున్నాం!

"ఇలాంటి శాడిస్ట్‌లా మన చానెల్స్‌ని నడుపుతోంది?" శాయిరామ్ చెవిలో గొణిగాడు రంగారెడ్డి.

"తరువాతేమవుతది మేడమ్?" కోపం కంట్రోల్ చేసుకుంటూ అడిగాడు యాదగిరి.

"తన భర్త నపుంసకుడని ఆ అమ్మాయి తల్లిదండ్రులతో చెప్పదు. తన భర్తను మామూలు మగాడిగా మార్చడానికి ఆమె రకరకాల ప్రయత్నాలు చేస్తుంటుంది. కానీ తన భార్యకు శారీరక సుఖం ఇవ్వలేకపోతున్నానే అన్న అశాంతితో, ఇన్‌ఫిరియారిటీ కాంప్లెక్స్‌తో– ఆ భర్త ఒక భయంకరమయిన శాడిస్ట్‌గా మారిపోతాడు. తన స్నేహితుడితోనే తన భార్యను రేప్ చేయించేందుకు ప్రయత్నిస్తూంటాడు.

వాంతొస్తున్నట్లు మొఖం పెట్టింది చంద్రమతీదేవి.

"మేడమ్– మాకో డౌటు" అన్నాడు రంగారెడ్డి మేడమ్ స్పీచ్‌కి అడ్డుపడుతూ.

"యస్– వాటీజ్ యువర్ డౌట్?"

"ఇలాంటి సీరియల్స్ చూసేది ఫ్యామిలీసా, బ్రోతల్ హౌసెస్‌లోని మెంబర్సా?"

ఆ ప్రశ్నతో ఆమెకి కోపం ముంచుకొచ్చేసింది.

"ఆ తిక్క ప్రశ్నలే నాకు నచ్చదు. సీరియల్స్ చూసే వాళ్ళెవరు అనే దానిమీద స్టాటిస్టిక్స్ మాకనవసరం! చూస్తున్నారా– లేదా– అంతే! చూస్తూంటే ఎంతమంది చూస్తున్నారు– అంతవరకే!"

"తరువాత ఇంకేం యాడ్ చేయమంటారు మేడమ్?" పరిస్థితి చెడిపోతోందని గ్రహించి టాపిక్ డైవర్ట్ చేశాడు యాదగిరి.

"ఆ అమ్మాయికి భర్త అయిన తన అన్నయ్య సంసారం సుఖం ఇవ్వటం లేదని తెలిసిన తమ్ముడు అవకాశం దొరికినప్పుడల్లా వదినెను రేప్ చేయడానికి ట్రై చేస్తూంటాడు–"

ఆ డైలాగ్ విని అందరూ షాకయ్యారు.

"వ్వాట్? వదినెను మరిది రేప్ చేయడానికి ప్రయత్నిస్తాడా? మీకేమయినా మెంటలా? మన సంస్కృతిలో వదినె తల్లితో సమానం అన్న కామన్‌సెన్స్ కూడా లేదా మీకు? మీతో రామాయణం సీరియల్ తీయిస్తే లక్ష్మణుడు సీతను రేప్ చేయడానికి ప్రయత్నించి నట్లు తీసేట్లున్నారు–"అంది సావిత్రి ఆవేశంగా. దాంతో మీనాభజన్ ఆవేశంగానే లేచినిలబడింది.

"ఇదిగో– మీకు తెలీపోతే మూసుకోండి! అంతేగానీ మీబోడి కామెంట్స్ ఇక్కెడెవరికీ అవసరం లేదు. టీవీ మీడియమ్ గురించి తెలీని మీలాంటి మూర్ఖులను ఎడ్యుకేట్ చేయాలనుకోవటం నాదీ తప్పు–" లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయిందామె.

మేము బయటికొచ్చేస్తూంటే రవి మా వెనుకే పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"మీరేమన్నారు సార్? మేడమ్ నామీద గరమ్ అవుతోంది– ఇలాంటి ఇడియట్స్‌ని రికమెండ్ చేస్తావా అని–" అడిగాడతను.

"మీనాభజన్ మేడమ్‌తో మాట్లాడాక మాకు కొన్ని డౌట్స్ వచ్చినయ్ రవీ! ఆ డౌట్స్ బయటకు చెప్తే ఆమెకు కోపం వచ్చింది–"  "ఏమిటి సార్ ఆ డౌట్స్?"

"మా కాలనీలో వాళ్ళందరికీ అసలు తండ్రెవరు? లేదా తల్లులకు పెళ్ళికిముందు ఫ్లాష్‌బాక్‌లేమిటి? కాలనీలో గాళ్స్ ఒకేసారి ఎంతమంది బాయ్స్‌ని లవ్ చేస్తున్నారు? ఆ బాయ్స్‌లో గాంగ్‌స్టర్స్ ఎంతమంది? ఎంతమంది భార్యలు కేవలం భర్తతోనే సంసారం చేస్తున్నారు? ఎంతమంది భర్తలు భార్యల్ని మర్డర్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు?"

రవి ఇంక శాయిరామ్ డౌట్స్ వినలేకపోయాడు.

"అర్థమయింది సార్– బెస్టాఫ్ లక్! ఇంకో చానెల్లో ట్రై చేయండి–" అనేసి వెళ్ళిపోయాడక్కడి నుంచీ!  ఆ రాత్రంతా మా కాలనీలో ఎవరికీ నిద్రపట్టలేదు.

"బోలెడు డబ్బు తగలేసి అనవసరంగా సీరియల్ తీశాం!" అన్నాడు రంగారెడ్డి దిగులుగా.

"నువ్వేం ఫికర్ చేయకన్నా! రేపు ఇంకో చానెల్ కెళ్దాం! అందరూ మీనాభజన్ లాంటి శాడిస్ట్‌లే వుండరు. నార్మల్ హ్యూమన్ బీయింగ్స్ ఖీ చానెల్స్‌లో ఉంటారు–" అన్నాడు యాదగిరి. ఆ మాటతో మాకు కొంత ధైర్యం వచ్చింది. మర్నాడు ఇంకో చానెల్‌కి చేరుకున్నాం! సాయంత్రం వరకూ వెయిట్ చేశాక సీరియల్స్ ఇన్‌ఛార్జ్ ప్రొడ్యూసర్ ఇంటర్‌వ్యూ ఇచ్చాడు. మా కాన్సెప్ట్ అంతా వినిపించింది చంద్రమతీదేవి.

"కథ మరీ అలా స్ట్రైట్‌గా ఉందేంటి? ఎక్కడికక్కడ ట్విస్ట్‌లూ, బాంగ్‌లూ అనెక్స్‌పెక్టెడ్ టర్నింగ్‌లూ ఉండాలి కదా–"

"అంటే ఎలా ఉండాలంటారు?"

"భర్త తన పాత ప్రియురాలిని తనింటికి తీసుకొచ్చి ఆమెతోనే సంసారం చేస్తుంటాడు. కోడలంటే పడని అతని తల్లిదండ్రులు కొడుకునే సపోర్ట్ చేసి అతని సెకండ్ సెటప్‌ని ఆ ఇంటి అసలు కోడలిలాగా ట్రీట్ చేస్తూంటారు.

భార్యను విడాకులిమ్మని భర్త అమెను కొడుతూంటాడు– అయినా భార్య వప్పుకోదు.

"చచ్చేంతవరకూ మీ భార్యగానే ఉంటానని సంధ్యాదేవికి మాట ఇచ్చాను– ఆ మాట తప్పను–" అంటుంది.

"సంధ్యాదేవెవరు?" షాకవుతూ అడుగుతాడు భర్త.

"నేను చెప్పను–" అంటుంది భార్య.

ఆ రోజునుంచీ సంధ్యాదేవి ఎవరో తెలుసుకోడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూంటాడు భర్త–"

"ఇంతకూ ఆ సంధ్యాదేవి ఎవరుసార్? అడిగాడు జనార్ధన్ ఆత్రుతగా.

"చూశారా! ఆ కారెక్టర్ గురించి మీ అందరికీ ఎంత సస్పెన్స్‌గా ఉందో! అలాంటి కారెక్టర్స్‌ని మనం సృష్టించాలన్నమాట! నిజానికి సంధ్యాదేవెవరో నాకూ తెలీదు. కానీ ఆ పాత్రను సృష్టించి, దానికో పెద్ద ఫ్లాష్‌బాక్ సృష్టించి– అయిదొందల ఎపిసోడ్‌ల తర్వాత మెయిన్ స్టోరీకి కలపాలి– అండర్‌స్టాండ్?"

"యస్సార్–"

"ఇప్పుడు కథ కింకో ట్విస్ట్ కావాలి! అదేంటంటే హీరోయిన్ ఒంటరిగా గుడికెళ్ళినప్పుడల్లా ఒక యువకుడు ఆమెను కలుసుకుని ఆమెకు ధైర్యం చెప్తూంటాడు–"

"అతనెవరు సార్?"

"నాకేం తెలుసు! నాకే కాదు! ఎవడికీ తెలీదు. ఇంకో అయిదొందల ఎపిసోడ్స్ వరకూ తెలీనక్కర్లేదుకూడా! ఆ తరువాత డిసైడ్ చేయవచ్చు. అతను ఆమె మాజీ భర్త అయుండవచ్చు. కానీ కొన్ని కారణాలవల్ల సంసారం చేయకుండానే విడిపోయి ఉండవచ్చు–

లేదా ఆమె ప్రియుడయి ఉండవచ్చు– లేదా–"

"అర్థమయింది సార్–" హాపీగా చెప్పాడు రంగారెడ్డి పిచ్చి చూపులు చూస్తూ–

అతను ఇంకా రకరకాల పాయింట్స్ చెప్తూనే ఉన్నాడు.

"ఈలోగా తోటి కోడలు ఎంటరవుతుంది ఇంట్లో! ఆమెకి పిల్లలు పుట్టరు. అందుకని తన భర్తతో హీరోయిన్‌కి గర్భధారణ చేయించి– ఆమెకి పాపపుడితే తనుపెంచుకోవాలని పన్నాగం పన్నుతుంది. అందుకు ఇద్దరు లేడీ గైనకాలజిస్ట్‌లు ఆమెకు సాయం చేస్తూంటారు. సడెన్‌గా హీరోయిన్ గర్భవతవుతుంది–" అందరం ఉలిక్కిపడ్డాం–

"ఎవరివల్ల గర్భం వచ్చింది?" అడిగాడు జనార్థన్ ఆత్రుతగా–

"ఆ సంగతి మనం ఇప్పటికిప్పుడే డిసైడ్ చేయాల్సిన అవసరం లేదు. ఇంకో రెండొందల ఎపిసోడ్‌ల వరకూ ప్రేక్షకులకు సస్పెన్స్! ఎవరు గర్భం చేశారు? అందరికీ ఆమె భర్త వల్లే గర్భవతయిందని అనుమానం కలిగిస్తాం గానీ ఆమె భర్తే ఒకరోజు భార్యను నిలదీస్తాడు.

"ఎవరి వల్ల నువ్వీ గర్భం ధరించావ్?" అంటూ హింసంచటం మరో వంద ఎపిసోడ్‌లు చూపిస్తాం! అప్పుడు ఆడియెన్స్‌కి ఇంకో షాక్!

ఆ షాకేంటంటే తనకు గర్భం ఎవరు చేశారో హీరోయిన్‌కే తెలీదు. గుళ్ళో దేముడి ముందు ఏడుస్తూ "స్వామీ నా గర్భంలోని బిడ్డకు తండ్రెవరో నువ్వయినా చెప్పు స్వామీ!" నువ్ చెప్పకపోతే ఇప్పుడే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాను" అంటూంటే సడెన్‌గా ఓ ముసుగు స్త్రీ వస్తుంది.

"జరిగిందంతా – నేను చెప్తానమ్మా!" అంటుందామె.

"మీరెవరు?"

"అది మాత్రం అడక్కు! నేను నీ శ్రేయోభిలాషిని! నీకు రక్షగా ఉంటానికే ఇక్కడి కొచ్చాను. ఇంకో వంద ఎపిసోడ్స్ తర్వాతే నా ముసుగు తీసి నా అసలు రూపం అందరికీ చూపిస్తాను–" అంటుందామె. "ఇంతకూ ఆ ముసుగులేడీ ఎవరు సార్?"

"నాకు మాత్రమేం తెలుసు! వంద ఎపిసోడ్స్ తర్వాత దాన్ని గురించి ఆలోచించవచ్చు– నా ఉద్దేశ్యం ఏమిటంటే– ఆమె ఒక లేడీ డాన్ అని ఆడియెన్స్‌కి షాకివ్వచ్చు. అ లేడీ డాన్ ఒకప్పుడు రాయలసీమ ఫామిలీకి చెందిన కోడలన్నమాట! ఈ ఫామిలీ వాళ్ళు ఆమె ఫామిలీ వాళ్ళందరినీ పాతికేళ్ళ క్రితం మర్డర్ చేశారన్నమాట!

ఇప్పుడు ఈ ఫామిలీని సర్వనాశనం చేసి రివెంజ్ తీసుకోడానికి వచ్చిందన్నమాట!"

అతను కిటికీలో నుంచి బయటకు చూస్తూ చెప్తూనే ఉన్నాడు.

మేమంతా అతను చూడకుండా సైగలు చేసుకుని శబ్దాలు కాకుండా ఒకరి వెనుక

ఒకరు బయటకు నడిచాం. మేమలా వెళ్ళిపోయిన విషయం అతనికింకా తెలిసినట్లులేదు. అందుకే ఆతను ఇంకా కొన్ని ట్విస్ట్‌లు చెప్పటం మాకు వినబడుతూనే ఉంది–

"అప్పుడు అనెక్స్‌పెక్టెడ్‌గా హీరో ఫస్ట్ వైఫ్‌కి పిచ్చెక్కుతుందన్నమాట! ఆ పిచ్చిలో చేసే పనులవల్ల కారెక్టర్స్ మధ్య క్లాషెస్! అందరికీ టెన్షన్–"

ఆఫీస్ బయటి కొచ్చాక ఎందుకయినా మంచిదని ఆ భవనం వేపు చూశాం అందరం. మేము వచ్చింది టీవీ చానెల్‌కా, మెంటల్ హాస్పిటల్‌కా అన్న అనుమానం క్లారిఫై చేసుకోడానికి! కానీ అలాంటి బోర్డ్ ఎక్కడా కనిపించలేదు.

వాచ్‌మెన్ మావేపు డౌటుగా చూశాడు.

"ఏంటి సార్– చూస్తున్నారు?" అడిగాడతను–

"మేము వచ్చింది టీవీ చానెల్‌కా లేక మెంటల్ హాస్పిటల్‌కా అన్న డౌట్ వచ్చింది– అందుకని బోర్డ్ కోసం వెతుకుతున్నాం!" అన్నాడు రంగారెడ్డి.

"మీకే కాద్సార్– చాలామందికి ఇదే డౌట్! ఎందుకంటే ఈ బిల్డింగ్‌లో ఒకప్పుడు మెంటల్ హాస్పిటల్ ఉండేది– అందుకే మా మానేజ్‌మెంట్ అదిగో ఆ గేటు బయటే బోర్డ్ పెట్టించింది" అంటూ బయట ఉన్న పెద్ద బోర్డ్ చూపించాడు.

అందరం ఆ బోర్డ్ దగ్గరకు నడిచాం.

"భ్రమణ టీవీ ఛానెల్ అన్న అక్షరాల కింది చిన్న అక్షరాలతో ఇంకో రెండు లైన్లు రాసి ఉన్నయ్.

"ఇంతవరకూ ఇక్కడ ఉన్న మెంటల్ హాస్పిటల్ ఇదే భవనంలో వెనుక వేపుకి మార్చబడినది– గమనించ ప్రార్థన–"

"చూశారా సార్– ఇంత క్లియర్‌గా రాసినా కూడా ఇంకా చాలామంది మెంటల్ హాస్పిటల్ అనుకుని చానెల్ ఆఫీస్‌లోకీ, చానెల్ ఆఫీస్ అనుకుని మెంటల్ హాస్పిటల్లోకీ వెళ్తాంటారు–" చెప్పాడు వాచ్‌మెన్.

"ఇంత క్లియర్‌గా రాసినా కూడా ఇంకా కన్‌ఫ్యూజన్ ఎందుకొస్తోంది?" అడిగాడు శాయిరామ్.

"ప్రాబ్లెమేంటంటే సార్– ఆ భ్రమణం చానెల్‌కీ, ఆ మెంటల్ హాస్పిటల్‌కీ ఓనర్ ఒక్కడే సార్! అందుకే కన్‌ఫ్యూజన్–"

ఎందుకయినా మంచిదని మేము కొంచెం ఫాస్ట్‌గా నడిచి అక్కడినుంచి బయటపడ్డాం!

ఆ రాత్రి ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టాం!

"ఆ రెండు చానెల్స్ వాళ్ళ క్రియేటివ్ హెడ్స్ చెప్పిన సజెషన్స్ విన్నారు కదా! అవన్నీ మన సీరియల్లో చేర్చటం పెద్ద కష్టమయిన పనేం కాదు.

అలా చేస్తే వాళ్ళు మన సీరియల్‌ని టెలికాస్ట్ చేస్తారు. టెలికాస్ట్ అయితే బోలెడు డబ్బు మన కాలనీ వెల్ఫేర్ సొసైటీ కొస్తుంది. నిజమే!

కానీ ఆ డబ్బుకోసం మనం మానాభిమానాలు, నీతీ, నియమాలు గాలికొదిలేస్తామా?" అడిగాడు గోపాల్రావ్.

"కేవలం డబ్బు సంపాదనే మనధ్యేయం అయినట్లయితే మం ఇలా ఎవరుద్యోగం వాళ్ళు చేసుకుంటూ చాలీచాలని జీవితాలు గడపాల్సిన అవసరం లేదు. ఏదొక ఫ్రాడ్‌చేసి తేలిగ్గా డబ్బు సంపాదించవచ్చు. కనుక ఆ మెంటల్ గాళ్ళు చెప్పిన వన్నీ మన సీరియల్లో జొప్పించే బదులు ఇంతవరకూ తీసిన ఆ పది ఎపిసోడ్‌లూ చెత్తబండీలో పారేద్దాం!" అంది పార్వతీదేవి.

ఏదేమయినా మర్నాడు ఇంక మిగిలిన మరో టీవీ చానెల్‌కెళ్ళి ఆఖరి ప్రయత్నం చేయాలనుకున్నాం.

మామూలుగానే రోజంతా పడిగాపులు పడ్డాక సాయంత్రం ఇంటర్వ్యూ ఇచ్చాడు సీరియల్స్ ఇన్‌ఛార్జ్... వెంటనే సీరియల్‌కి మేము తీసుకున్న సబ్జెక్ట్ గురించి చెప్పటం మొదలుపెట్టింది పార్వతీదేవి.

"మేము తీసుకున్న సబ్జెక్ట్ ఆషామాషీ టైప్ కాదండీ! సాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన బ్రహ్మకుమారి గారి నవలండీ–"

అతనికి అర్థమయినట్లులేదు. "బ్రహ్మకుమారా?"

"అవునండీ!"

"ఆవిడకు అదేదో అకాడెమీ అవార్డ్ ఇచ్చారా?"

"ఆవిడకు కాదండీ! ఆమెరాసిన నవలకి– ఆ నవల్నే మా సీరియల్‌కి అడాప్ట్ చేసుకున్నామండీ–"

"ఇదిగో చూడండీ! సీరియల్ స్టోరీ ఏంటి– ఎవర్రాశారు? ఎందుకు రాశారు? ఇవన్నీ మాకనవసరం!" మేము షాకయ్యాం!

"అదేంటి సార్– సీరియల్‌కి ముఖ్యం స్టోరీ కాదా?"

"స్టోరీ ఏంటనేది కాదు– ఎలా– ఎంత ఎఫెక్టివ్‌గా చూపించాం అనేది ఇంపార్టెంట్–"

"పోనీ మా సీరియల్ టెక్నికల్ టీమ్ గురించీ, డైరెక్టర్ గురించీ చెప్పమంటారా?"

"వేస్టాఫ్ టైమ్!"

మాకు మతిపోయినట్లయింది.

"అయితే మరి మీకేది ఇంపార్టెంట్?"

"పర్సెంటేజ్ ఎంత?"

మాకా ప్రశ్న అర్థం కాలేదు. అందరం ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం! ఎవరికీ ఆ ప్రశ్న అర్థం కాలేదన్న విషయం అందరికీ అర్థమయింది.

"పర్సెంటేజ్ అంటే– కొంచెం వివరంగా చెప్తారా?" అతను షాకయ్యాడు.

"వ్వాట్? పర్సెంటేజ్ అంటే ఏంటో తెలీకుండా టీవీ సీరియల్ తీశారా? ఓగాడ్! ఎలాంటెలాంటి వాళ్ళొస్తున్నార్రా ఫీల్డ్‌లోకి! ఇదిగో– చూడండి మిస్టర్! ఏమీ తెలీని మీలాంటి వాళ్ళను ఎడ్యుకేట్ చేసేంత టైమ్ నాకు లేదు– మీకు అంత సీన్‌లేదు. ఇంక వెళ్ళండి–"

అందరం కంగారుపడ్డాం.

"సారీ సర్! ఫస్ట్ టైమ్ సీరియల్ తీశాం! మీరు అన్న పదాల గురించి నేర్చుకుంటాం! ప్రస్తుతానికి కొంచెం హెల్ప్ చేయండి–" బ్రతిమాలాడు బోసు. అతను మా పరస్థితి చూసి జాలిపడినట్లున్నాడు.

"పర్సేంటేజ్ అంటే మీరిచ్చే పర్సెంటేజ్ ఎంత అని నా అర్థం–" అన్నాడు కొంత వివరణ ఇస్తూ.

మాకన్ఫ్యూజన్ ఇంకొంచెం ఎక్కువయింది.

"మేమిచ్చే పర్సెంటేజా?"

"అవును!"

"మేం పర్సెంటేజ్ ఇవ్వటమేంటి?"

"ఇవ్వకపోతే కుదరదండీ–"

"అదే అడుగుతున్నాం సార్– పర్సెంటేజ్ అంటే ఏంటి? ఎవరు ఎవరికివ్వాలి?" అడిగాడు జనార్ధన్.

అతను తలరెండు చేతుల్తో పట్టుకున్నాడు.

"ఓర్నాయనో! మరీ ఇంత ఎమెచ్యూర్సా! మీతో ఇంకాసేపు మాట్లాడితే బీపీ పెరిగి పోతుంది. వన్‌మినిట్–" అంటూ సొరుగులాగి అందులోనుంచి ఒక టాబ్లెట్ తీసుకుని నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగాడు.

"చూడండి! మీరు సీరియల్ తీశారు. అవునా?"

"అవున్సార్–"

"అందుగ్గాను కొంత డబ్బు ఖర్చుపెట్టారు– అవునా?"

"కరెక్ట్ సార్–"

"ఇప్పుడు మీ సీరియల్‌ని మా చానెల్ కమ్మి నాలుగు రూపాయలు లాభం పొందాలనుకుంటున్నారు– అవునా?"

"ఆహా అరటిపండు వలచినట్లు చెప్పారు సార్–"

"అంటే మీరు తీసిన ప్రతి ఎపిసోడ్‌కి మేము మీకు ఇంతమొత్తం ఇవ్వాలి– అని అనుకుని ఆ మొత్తం మీకిస్తాం! అవునా?"

"అవున్సార్–"

"ఇక్కడే అసలు మేటరుంది? మేము మీకిచ్చేమనీలో మాకెంత పర్సెంటేజ్ ఇస్తారు?"

అప్పుడర్థమయినట్లుంది రంగారెడ్డికి.

"అదే రాభయ్! కిక్‌బాక్స్ అంటారు చూడండి! రాజా, కనిమోళి, గాలి, కల్మాడీ లాంటివాళ్ళు కాజేసిన డబ్బులాంటిది–"

"ఓహో! మీరడిగేది మీ కమిషనా?"

"అవును!"

"ఇలా కమిషన్ ఇచ్చే ప్రోగ్రామ్స్‌నే కమిషన్డ్ ప్రొగ్రామ్స్ అంటారేమో రా భయ్–" అన్నాడు యాదగిరి.

"అయితే ఇచ్చేద్దాం! మనదేం పోయింది? వాళ్ళిచ్చే డబ్బులోనే వీడిక్కొంత ఇవ్వాలి. అంతేకదా! అన్నాడు గోపాల్రావ్.

"మీరే చెప్పండి సార్ ఎంతివ్వాలో– మాకేం తెలుస్తుంది? ఎమెచ్యూర్స్‌కదా మేము– గైడ్ చేయండి" అన్నాడు శాయిరామ్.

"జనరల్‌గా నేను ట్వంటీ పర్సెంట్ తీసుకుంటాను–"

"అంటే?"

"అంటే మా చానెల్ మీకు ఎపిసోడ్‌కి లక్షరూపాయలిచ్చిందనుకోండి! అందులో ఇరవై వేలు నాకివ్వాలి–"

మేమంతా ఓ మూలకెళ్ళి డిస్కస్ చేసుకున్నాం.

"అన్ని చానెల్స్‌లో ఈ పవిత్రబంధం తప్పదంట బ్రదర్– మన రవి చెప్పాడు కదా! ఇచ్చిపారేద్దాం–" అన్నాడు జనార్థన్.

"ఓకేసార్! ఎగ్రీడ్–" అన్నాడు రంగారెడ్డి.


"అయితే ఇక్కడో మేటర్ మీరు తెలుసుకోవాలి–"

"ఏమిటి సార్?"

"మేము మీకు మొదటి ఎపిసోడ్ డబ్బు అరవయ్యో ఎపిసోడ్ టెలికాస్ట్ అయేవరకూ ఇవ్వం! అంటే అంతవరకూ ఖర్చంతామీదే! అంటే నా కమిషన్ మాత్రం ముందే ఇచ్చేయాలి–"

మాకు గుండెలవిసిపోయినయ్.

అతను చెప్పినమేటర్‌ని బట్టి మేము షుమారు రెండుకోట్లు ముందు ఇన్‌వెస్ట్‌చేయాలి.




అంత డబ్బు మా దగ్గరెక్కడుంటుంది?

అదే అతన్తో చెప్పాం.

అతను మండిపడుతూ లేచినిలబడ్డాడు.

"బ్లాక్‌మనీ లేనోళ్ళు టీవీ సీరియల్స్‌లో కెందుకొస్తారయ్యా? వెళ్ళండి వెళ్ళండి– పొద్దున్నే నాటైమ్ ఖరాబ్–" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

మేము ఇళ్ళకు చేరుకుని ఆ ఎపిసోడ్స్ కాసెట్ కాలనీ చెత్తబుట్టలో పడేశాం–

* * * * *